# కవితా కౌముది

"శ్రీ పరాభవ" నామ సంవత్సర ఉగాది సందర్భంగా

వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన

31 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో

కవిత విభాగంలో బహుమతి పొందిన కవితలు

## పునరపి

- ర్యాలి ప్రసాద్, కాకినాడ

కొండను చూసినపుడల్లా

తలకిందులుగా తపస్సు చేస్తున్న

బవిరి గెడ్డపు మునిలా వుంటుంది

ఎప్పుడో కంటబడ్డ దృశ్యాలు

ఈది ఈది కలల దగ్గరకొచ్చి ఆగుతాయి

మెలకువను సుతారంగా తాకి

ఒక్కోసారవి ఛిద్రమవుతాయి.

తూర్పున మెరిసిన ఎర్రచుక్కకు

చీకటి కమ్మే శిరోజాలు విరబోసుకుంటాయి.

మిణుగురు వెల్గిన వెలుగుచారింకా

మెరుస్తూనే వుంది

నది మూలానికి చేరకుండానే అంతమైంది

కొండల నాచు మెరుస్తుంది

మంచు పచ్చగా మౌనం వహిస్తుంది.

చెప్పుల్ని విడిగా వుంచవద్దు

ఒంటరి చెప్పు ఏమందం

మూసి వున్న గొడుగు తెరచినపుడే

వాన కురిసినట్లు కాదని

కన్నీరు మాత్రమే ఏ గాయాన్నైనా

మాన్పే లేపనం కాదని

రక్తహీన నీడల్లో ఖాళీ రెక్కలతో

ఆకాశాన్నీదే పక్షికి తెలుసు

వానలో తడిచిన పూవు

రేకుల్ని నేలకు ప్రసాదించింది

ఏ జన్మ తాళం చెవో దొరికి

జ్ఞాపకాల పెట్టి తెరుచుకుంటుంది

మనసు మీద తేలిన వాతలకు

లేపనాన్ని పూసేందుకే పరిమితమైన చేతులు

ఎప్పటికి పిడికిళ్లవుతాయో !

రేపటికి రాత్రి మిగులుతుందో లేదో

తెలీదు కానీ ఈ చీకటిని ఆస్వాదించనీ.

గాయపడ్డ విజయాల్లోంచి

అదేపనిగా మనసూరుతుంది

రెప్పల దగ్గర నిర్జీవంగా జ్ఞాపకాలు

కంటిలోకి ప్రవేశించి ఊపిరి పోసుకుంటాయి

మనసు లోలకమై ఊగిసలాడుతోంది

తప్పులు చేయడానికే లోకాగమనమని

విధిని వీలైనంత ప్రలోభపెట్టాలనే భ్రమలో

రకరకాల రూపాలు కళ్ళు మూసుకుని ధరిస్తాం

కాలం తెల్లసిరాతో చేసిన సంతకం

నల్లని శిరోకాశంలో వెన్నెల ముక్క

గడియారం నుండి సెకన్ల ముల్లు

తీసేస్తే ఏమి లాభం

సృష్టి ఈదాల్సిన దు:ఖ నది

ఆ గుట్టు తెలిసాకే జన్మరాహిత్యం

## వెళ్ళిపోయిన మేఘం

పరకపల్లి యాదగిరి- సిద్ధిపేట, తెలంగాణా

రెండు కొండలనడుమ

జలని ఎవ్వరూ పుట్టించరు

నదుల్ని ఎవ్వరూ తవ్వరు

ఆ నదులకు దరుల దూరం పెంచడం  తప్ప కలుపడం తెలియదు

దరుల విరహపు వేడి

తగిలి వెచ్చదనాన్ని

ఆస్వాదిస్తుందే తప్ప

ఇతరుల ఎదురుచూపులతో

నదికి ఏం పని

..........................................

లేలేత పాదాల నడకలైతే

ఆరంభమైనాయి

పలుకులెరుగని నాలుకల

తడబాటు మొదలైయ్యింది

కన్నులు ఎదురుపడితే చాలు

మిన్నంతా ఇంద్రధనుస్సులే

ఎదలరొదలు ఎవరికి

అర్ధమయ్యాయోలేదో కానీ వేపకొమ్మల తెరలనుండి

కార్తీక వెన్నెళ్ళు మాత్రం

బాగానే ఆస్వాదించి ఉంటాయి

ఆయుధమెప్పుడూ

సంధించుకున్నదీ లేదు
నెత్తురేనాడు చిందినది లేదు
గాయం సలుపరమైతే పెడుతోంది
ఎక్కడ తడుముకున్నా
దాని జాడైతే దొరుకడంలేదు
అదేమీ మాయో

.............................

ఎన్ని దాహాలో
ఎన్నెన్ని ఆకల్లో
ఎన్నెన్ని కన్నంటుకోని రాత్రుల్లో
ఎన్ని అలజడులో
ఎన్ని స్వప్నాలో
ఎన్ని ఊహల ఆలింగనాలో
ఎన్నిసార్లు కన్నుల స్ఖలనాలో

ఎవరినెవరు ఊరడించుకున్నదీ లేదు
ఎవరికెవరు అప్పగింతలు చేసుకున్నదీ లేదు
ఏమేమి బాసలుచేసుకున్నదీ లేదు
హామీలు ఇచ్చుకున్నది లేదు

అసలేమిటీ ఉక్కపోత
ఊపిరాడని ఉక్కిరిబిక్కిరి
ఉన్నకాడ ఉండలేని
ఊరుకులాట
పగలంతా ఎడారిని
తొడుక్కున్నట్టూ
రాత్రంతా మంచుదుప్పటి
కప్పుకున్నట్టూ ఉంటోంది
కళ్ళముందు అన్నీ
విప్పలేని చిక్కుముడులే

..................

చాలామంది అంటూ ఉంటారు
జీవితమంటే ముందుకు
సాగిపోవటమేనని
నా దృష్టిలో వెనక్కి నడవడం
కూడా జీవితమే
మూలాలూ పునాదులూ
అనుభవాలూ అనుభూతులూ
గుణపాఠాలు ఉంటాయి
పునఃస్పర్శలూ పునశ్చరణలూ
కూడా ఉంటాయి

తీపైనా చేదైనా
సుమధురమైనా అమధురమైనా
చప్పరించక అదరాలకు తప్పుతుందా..

‘భ్రమ- విభ్రమ’ గుడిపాటి వెంకట హేమలత - గుంటూరు, ఆంధ్ర ప్రదేశ్ (ప్రశంసా పత్రం)

నేనో దీర్ఘకాలిక

భావోద్వేగ తప్త హృదయాన్ని

అనంత ఆవర్తిత నిర్వేదాన్ని!

పొగ గొట్టంలోకి ఊపిరులూది

కట్టెలని మండించిన

పాతకాలపు గృహిణిని కాను

వ్యాకరణం తెలియని

వాక్య నిర్మాణం రాని,

బొత్తిగా గజిబిజి గణిత సూత్రాలెరుగనిదాన్ని

బేజారు భాషా బజారు భాషా

రెండూ తెలియని దాన్ని

మొండి చెట్టులా

శత పెంకల ఎండిన కాసారాన్ని

కొద్దో గొప్పో మిత్తువ చదువును

కిరాణాలెక్కకి మితం చేసిన దాన్ని

అవును! నేను సామాన్య

మధ్య తరగతి గృహిణిని

అందరూ అంటున్న హౌస్ వైఫ్ ని

నా చుట్టూ ఆదర్శాల పందిళ్లల్లుకుంటూ

అప్పుడప్పుడు

సూక్తి ప్రవచనాలు వింటూ

నన్ను నేను నియంత్రించుకున్న దాన్ని

పిరికి చూపులు నటిస్తూ

నయగారాలు పోయే మొగుణ్ణి

అప్పుడప్పుడూ

జాలిపడే అత్తగారిని

ఇద్దరి ఆడవాళ్ళ ముందు

బడాయి పోయే మామ గారిని

సంభాళించుకుంటున్నదాన్ని

కాటుక కళ్ళకు రెప్పలని అడ్డుగా పెట్టి

కన్నీళ్ళని చెంపల పైకి చేరకుండా

చిరునవ్వుతో  అనాహతంగా

వలయావర్తపు భ్రమణంలో

చేరువెరుగని తలపులతో మునకలేస్తూ

గోతుల చీకటి దారుల్లో ధైర్యమే దీపంగా

చాలీచాలని జమా ఖర్చుతో

మరచి వెరచి పోలేని చేబదుళ్ళతో

ఇంటిని చక్కబెట్టే దాన్ని.

అవును! నేను సామాన్య

మధ్య తరగతి గృహిణిని.

అనుకోకుండా చిన్ననాటి స్నేహితురాలు

జ్ఞాపకాల్లో ఇటునుంచి అటు వెళుతూ

ఆనవాళ్లుగా నా మెహర్బానీ

ముచ్చటను పొలమారుస్తుంది

చలం సాహిత్య స్త్రీ పాత్రల గంపగుత్తిలో

నన్ను తరాసుతో తూస్తుంది

నిరాశామయ లోకంలో తిరస్కృతి

నుంచి ఎప్పటికో నిష్కృతి?

అస్తవ్యస్త  అనుమానాలు

'అసహాయ'ననే భయాలు

సంకుచిత భావాల ఆలోచనల సెలయేళ్లు

అగమ్య గగనాల

ఆంతర్యాలను వెతుకుతూ...

ఆకాశంలో ఓ నక్షత్రం విరగబడి నవ్వుతుంది.

సగం మూసిన తలుపు

ఇంకో సగం మూసేస్తుంది.

ఓ శారద రాత్రి నాలోని విసర్గభావాలన్నీ

నా భర్త సమక్షంలో ఆవిరై

అక్షరాల్లేని మాటలు

అసలు మాటలే లేని అనుభూతుల్ని

రాత్రి ఉదయించేదాకా అనుభవంలోకి తెస్తుంది.

నా బిడ్డగా ఇంకొక విశ్వాసానికి

పురుడు పోస్తుంది

పిల్లాడికి కొద్దిగా ఒళ్ళు వెచ్చబడితే

నిమిషమైనా వాడిని వదలక

అవిరళ శక్తిని కూడుకుంటూ

జాగారాలు చేస్తూ

తులసి కోట చుట్టూ ప్రదక్షిణాలు చేస్తూ..

ప్రకృతి సాక్షిగా పెంచి పెద్ద చేసిన దాన్ని

'అమ్మకి ఏమీ తెలియదు

అన్నీ అమ్మకి తెలుసు' అనే

సాకార వికార అభిప్రాయాలతో

అప్పుడప్పుడూ అగాధంలోకి

అప్పుడప్పుడూ హిమవత్

శిఖరాగ్రం మీదకి

శృంగాలూ ద్రోణుల్లా వారి మధ్య

విభేదాలు వచ్చినప్పుడల్లా

గతం భవితవ్యాల మధ్య సవాళ్లను

కుటుంబ కోర్టులో హాజరు పరిచేదాన్ని.

అవును నేను అమ్మని

సగటు మధ్యతరగతి అమ్మని.

ఉప్పొంగే ఊహలకు ఊతం ఇస్తూ

మెరిసి రగిలే మేధకు ఉత్ప్రేరకమవుతూ

కరణేషు మంత్రిలా పెనిమిటి పురోభివృద్ధికి

పిల్లల అంచెలంచెల విజయాకాశ హర్మ్యాలకు

బలమైన పునాదినై గర్వించే నిస్వార్థ ధునిని!

నేను గృహిణిని..!! గృహసీమకి రారాణిని!!

రేపటి కోసం నిన్నలను వెనక్కితోస్తూ

కాలం స్కేలు పై రోజులను లెక్కేస్తూ

క్యాలెండర్లు తిప్పేస్తూ

పిల్లలు గువ్వల్లా తటాల్న ఎగిరిపోతే

ఆగామి ఆశల ఆనంద సేతువు

దాటేలోపే కూలిపోతే

సమూహంలో ఉన్నా ఏకాంతంగా ఉంటూ

ఏకాంతంలోనూ జడత్వంతో

తప్పెవరిదో తేల్చుకోలేని దాన్ని

తప్పేముంది అనే ప్రశ్నకు జవాబు

ఇవ్వలేక 'తప్పేదేముంది' అని

సర్దుకుపోవడమే తెలిసిన దాన్ని

వాగ్వివాదాలు చేసినా లాభం లేదని

రాజీ పడిపోయే రాజీవ లోచనిని!!

జీవన రహదారి ప్రతి మలుపులో

చిన్నప్పుడు నాన్న చాటుగా

సౌభాగ్యాన భర్త చాటుగా

విధివసాన బిడ్డ చాటుగా

అభద్రతలను చాటు చేసుకుంటూ

దీని పేరే డిప్రెషన్ అనుకుంటూ

మానసిక రోగం మాయ రోగం!

నా చుట్టూ అనంతశూన్యాలు

నా కళ్ళ కింద నల్లటి వలయాలు

ఈ అభద్రతను అధునాతన పదాలల్లి

కళాత్మక రసధారలతో వర్ణించలేని దాన్ని

వంచించుకోవడం చేతకానిదాన్ని

ఘటన – నటనల మధ్య తేడాను

సరిగ్గా పోల్చుకోలేని దాన్ని

భ్రమ విభ్రమల మధ్య జడీభూత

మనసును నిలువరించలేనిదాన్ని

ఆఖరి ఊపిరి వరకు నా ఇంటి

వాళ్లకోసమే తాపత్రయపడే

నా ఇల్లే నా అస్తిత్వం అనుకునే

సగటు సామాన్య గృహిణిని

అవును నేను హౌస్ వైఫ్ ని!

దేశానికే మూలాధారమైన

జాతికి గర్వకారణమైన

కుటుంబ వ్యవస్థ కుంటుపడకుండా

పటిష్టపరుస్తూ పలుతరాలకు

పాసాన్ చేస్తున్న సాంప్రదాయ వారధిని!!

## కృత్రిమ మేధ

- సతీష్ గొల్లపూడి – Christ Church, New Zealand (ప్రశంసా పత్రం)

ఆ పాట జ్వలించిన కవి రాసిన కన్నీటి చుక్క కాదు

ఆ చిత్రం చలించిన చిత్రకారుడు దిద్దిన దృశ్యం కాదు

అనుభూతితో తడవని అక్షరాలు, ఆర్ద్రతతో మెరవని స్వరాలు

కళాకారుడు లేకుండా యంత్రం నుంచి పుట్టుకొస్తున్న సరికొత్త కళ

మనిషి నుంచి మనిషికి ప్రసరించే హృదయాంతరాల ఉద్వేగం కళ అన్నది ఇక కల

గుర్తింపు ఎవరికి ఇవ్వాలి? ఎవరిని అభినందించాలి?

మార్పు సహజమని స్వాగతించాలా? వికృత కూర్పుగా సందేహించాలా?

గగనగోళాలైన, గణిత సూత్రాలైన, సమస్త శాస్త్రాలైన నేడు చిరు గణనలు

చరిత్ర పుటలైన, తాత్విక గతులైన, సర్వకాలాలైనా నేడు క్షణ మననాలు

యంత్రానికి స్వయం ఆలోచన మంత్రం నేర్పిన శ్రమలేని తంత్రం

కాంతి వేగంతో పరిష్కారాలు, శతకోటి ఆవిష్కారాలు కృత్రిమ మేధా విన్యాసాలు

ప్రగతి ప్రస్థాన మేధో వికాస విప్లవమా? లేక నిరుద్యోగ భూత ఆవాహనమా?

ఏ గమ్యాలను చేరడానికి ఈ శోధనలు? ఎవరి ప్రయోజనాలకు ఈ సాధనాలు?

లోక కళ్యాణానికి దిద్దిన తిలకమా? సమాజ శైథిల్యానికి చిహ్నమా?

ఆత్మలేని యంత్రానికి అంతఃచేతన చేరితే

చావులేని లోహానికి అహం దూరితే

మానవుల అదుపు ఆజ్ఞలలో కలకాలం ఉంటుందా యంత్రమతి?

అమేయ మేధ మరల కలయికకు హృదయం పుడితే

అపార తార్కిక ధీశక్తికి మనోవికారం కలిగితే

శక్తియుక్తులతో మానవాళిని కబళించక ఉంటుందా వక్రశృతి?

దేవుని తడబాటుతో చేసిన సృష్టిలో ఎన్ని అన్యాయాలు, అసమానతలు

మానవుడు పోరాడి గెలుచుకున్న స్వాతంత్రాలు, స్వరాజ్యాలు

మనిషి పొరపాటులో తాను సృష్టించిన యంత్రానికే

మరలా బానిస అవుతాడా? లేక ఏకంగా బలి అవుతాడా?

యంత్రమేధస్సుకు హృదయం కూర్చే తపనలో

మనిషి తన ఎద చప్పుడు తానే వినకపోతే ఎలా?

కీడు ఎంచి మేలు ఎంచాలి. మరచిపోయారా వామనుడి కథ?

విజ్ఞానమే విషం అయితే ఇక విరుగుడు ఏముంటుంది?

సాంకేతికతే ధ్వంస సాధనమైతే మనగడ ఎక్కడుంటుంది?

ఏదో పొందే ఆరాటంలో ఏమి కోల్పోతున్నామో చూసేది ఎవరు?

సృష్టికి చేస్తున్న ప్రతిసృష్టిలో మనిషి తనను తాను పునర్నిర్వచించుకోక తప్పదు

యుగాల తన నమ్మకపు పునాదులు, జీవనదారులలో సమూల మార్పులు తప్పవు

జరిగేది మంచో చెడో – అనేక ప్రశ్నలు

కాలమే సమాధానం చెబుతుందని ఊరుకోవాలా?

మనమే పూనుకొని సరిదిద్దుకోవాలా ?

"శ్రీ పరాభవ" నామ సంవత్సర ఉగాది సందర్భంగా

వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన

31 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో

మొట్టమొదటి కవిత విభాగంలో విభాగం విజేతలు

‘అర్ధరాత్రి సూర్యుడు’

చిందం రమేశ్, జగిత్యాల జిల్లా, తెలంగాణా

మృత్యువు తన వీలునామా రాస్తూ రాస్తూ

ఈ రాత్రికి నన్ను ఎంచుకుంది.......

పగలంతా నా నీడలా వెంటాడుతూ వెంటాడుతూ

సూర్యాస్తమయానికి నాలోకి ఆవహించింది.....

చెట్టు వేర్లు విస్తరించినట్టుగా

ఇప్పుడు మరణం అనేక రకాలు....

గది నిండా శూన్యం....

గడియారం గంట లీలగా కదులుతుంది మృత్యువులా...

చావుని తప్పించుకుని తిరుగుతూ తిరుగుతూ

నాలోనికి నేనే ప్రవేశించాను... స్వకాయ ప్రవేశం....

గుబులు నా దేహాన్ని నెమ్మదిగా తొలుస్తుంది.....

భయమనేది బయటకు కనపడని రాచపుండు....

చీకటి పెరిగిన కొలది మృత్యువు ముంచుకోస్తుంది...

కౌగలించుకోవడానికి రెండు చేతులు చాస్తుంది...

మరణం తధ్యం......

ఒక స్పర్శ...

సగం స్వప్నంలో నుండి నడిచివచ్చి కొత్త ఆశలకు చిగురులు తొడుగుతుంది...

రాలిపోతున్న పండు కొత్త చెట్టుని వాగ్దానం చేస్తుంది....

శిశిరం ఆత్మహత్య చేసుకుంటూ వసంతాన్ని ప్రసవిస్తుంది....

చీకటిని చూస్తే భయం పోయింది...

సూర్యుడు అర్ధరాత్రి అక్షరాలుగా ఉదయిస్తున్నాడు...

వెన్నెల పాన్పుపై రవిని రచిస్తున్నాను....

కత్తుల వంతెనల మీద నెత్తురు కారకుండా నడవడం నేర్చుకున్నాను...

కన్నీళ్ళలో తడవకుండా ఈదడము వచ్చింది...

తెల్లావారు వచ్చే స్వప్నం ఒకటి రాచపుండుపై లేపనంగా వాలింది...

కాస్త కన్ను మూసుకుందామని అలా ఒరగగానే

మృత్యువు జోలపాట పాడుతుంది....

ఈ రాత్రికి కునుకు వస్తే చాలు....

## కలం సాక్షిగా..

సూర్య ప్రకాష్ – శ్రీకాకుళం, ఆంధ్ర ప్రదేశ్ (ప్రశంసా పత్రం)

పలకా బలపం పట్టుకొని,
బ్యాగూ బాక్సు మోసుకొని,
బడికెళ్లే వయసు రాలేదని
చూపిస్తూ జాబిల్లిని,
కథలెన్నో చెప్తోందమ్మ, ఒడిలో కూర్చోబెట్టుకొని.
కథలు వినడమే గానీ...
కలం పట్టుకుని రాయలేని వయసది
అనగనగా ఒక రాజు, అనగనగా ఒక పే...ద్ద చెరువు
అనగనగా ఒక బూచోడు, అనగనగా కాకులు దూరని కారడవి
ఇలా కథలన్నీ కదిలి వెళ్తుంటే..
పే...ద్ద చెరువంటే మా ఊరు చెరువు కన్నా పెద్దదేమోనని!
కారడవి అంటే మా తోటలా ఉంటుందని!
ఊహల్లో రూపాలు దిద్దిన ప్రాయమది.
మరోవైపు ఆరు బయట మంచం మీద
నాన్న పక్కన నింగిలోకి తొంగి చూస్తూ
తారలన్నీ లెక్కబెడుతూ...
ఈ మూడు నక్షత్రాలు కలిస్తే కావడి

ఆ ఐదు నక్షత్రాలు కలిస్తే గుర్రమంటూ, గాలి పటమంటూ
పసి మనసులో అంతులేని ప్రశ్నలతో
ఆన్సర్లు వెతుకుతూ గడిచిందీ బాల్యం.
కడుపు నొప్పి సాకు పాతదని
లంచ్ బాక్స్ దారిలో పడిపోయిందని
మ్యాథ్స్ టీచర్ కు భయపడి జ్వరం వచ్చిందని
స్కూల్ ఎగ్గొట్టే రోజులను దాటి
ఎలాగోలా పాసయ్యా పదో తరగతి.
ఎంపీసీ, బైపీసీ, ఎంఈసి, హెచ్ఇసి అంటూ
ఏవైపో తెలియక, పడుతూ తికమక
ఎంపీసీ అయితే ఏ వైపుకైనా వెళ్ళొచ్చని..
ఓటేస్తూ ముందుకెళ్ళా
ఎంసెట్లో ర్యాంకుతో ఎగిరిపడి ఇంజనీరింగ్ లో చేరి
అడిగే వారు లేరులే! ఆపేవారు ఎవరులే? అంటూ..
గోడలు కట్టాల్సిన ఇంజనీరు గోడలు దూకి
సినిమాలకు, ఔటింగ్లకు వెళ్ళి
నాలుగేళ్ల నావను నానా తిప్పలు పడి ఒడ్డుకు చేర్చి,
నిరుద్యోగిలా నీరసించి,
నిద్రమాని లోకాలన్నీ తిరిగి తిరిగి
ఎలాగోలా ఉద్యోగం సాధించి
రిటైరయ్యాక చూస్తే వెనక్కి తిరిగి
ఆ రోజులే బాగుండేవి!
కలం పట్టుకుని రాయలేని రోజు నుండి
కలం పట్టలేనంతగా వణికిపోయే ఈ రోజు వరకు..
పీపీలు ఊదుకుంటూ.. ఊరంతా చుట్టేసిన రోజు నుండి
బీపీలు, షుగరుతో రూమైనా దాటలేని రోజుకు చేరా..
ఊహల్లో లోకాన్ని చూసిన వైనం

కాగితం కూడా చూడలేకపోతోంది –

కన్నీటితో నిండిన నయనం.

ఎంతైనా... ఆరోజులే బాగుండేవి!

జీవితకాలం ముప్పై సెకన్లే... నాగుల దుర్గాభవాని, కరీం నగర్ జిల్లా, తెలంగాణా(ప్రశంసా పత్రం)

మట్టిపొయ్యిని ముద్దుగా అలికి బొట్టు పెట్టి

చిన్నచిన్న పుల్లలతో మంట వెలిగించి

నున్నటి సుతారమైన మట్టిపాత్రను పెట్టి

నూనెను పోసి కాసిన్ని పోపుదినుసులు వేసి

సన్నటి సెగ మీద

మనసు పెట్టి నిదానంగా గరిటె తిప్పుతుంటే

బతుకంతా కమ్మనివాసన అలుముకుంటాది.......

చిన్నగా తరిగిన మిరపకాయల చిటపటలు

మెత్తగా నూరినా ఉల్లిపాయల రుసరుసలు

అల్లం ఎల్లిపాయ వేగితే ఎద నిండా ఎంతో హాయి....

పచ్చివాసన పోగానే కాసింతా పసుపును తాకిస్తే చాలు

జీవితమంతా సింగిడిరంగుల ఆకలిమయం.....

కోరినా కూరగాయలను కంటికి ఇంపుగా కడిగి కత్తిరించి

పాత్రలో వేసి ఇంత ఉప్పుకారం దట్టించి

మంచి మంచి మాల్ మసాలాలను అట్టించగానే

కుతకుత ఉడుకుతూ

కుండ ఒడిలో చేలరేగే నానారుచుల హంగామా....

చిన్న మంటపై ఆవిరిలో ఉడికించి

ఆఖర్లో ఏరికోరి తెచ్చిన కొత్తిమీర కొసలను అట్ల అలంకరించగానే... అయిపాయే...

బతుకంతా ఆకలికి అసలైన బంగారు భోజనం....

కాని మనకు అంతా ఓపిక ఎక్కడిది...

కుక్కర్లో కుక్కి ఊపిరాడనివ్వకుండా ఉత్త విజిల్లకే

కుక్కిన పేనులా కూలినట్లు ఉడికే ఉడుకుడుకు కూర....

అది కరాబై కంపు వాసన కొట్టిన

కంటికి ఇంపుగా ఫుడ్ కలర్లు పులమగానే

నిగనిగలాడేలా ఇన్స్టంట్ రెడిమెడ్ ఫుడ్

రెండు నిమిషాల్లో రెడీ... రెడీ టు ఈట్....

కవర్ల నుంచి నేరుగా కడుపులోకే.....

బతుకంతా కంచంలో కాసింత కూడు పెట్టుకుని

కమ్మగా ఆస్వాదిస్తూ ఆరగించలేని ఓ ఆధునిక నరుడా.....

ఆదిమ మానవుని నుండి ఆండ్రాయిడ్ మనిషి దాక

ఎనకటికాలం నుండి AI కాలం దాక ఎంతవరకు ఎదిగామంటే

నూరేళ్లు కరువును కాలాన్ని కళ్ళారా చూసే బతుకు నుండి

ముప్పై సెకన్ల ఇన్స్టాగ్రాం రీల్ దాక...

అంతా షాట్ కట్... కట్...కట్...కట్...

శ్రీ పరాభవ" నామ సంవత్సర ఉగాది సందర్భంగా

వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన

31 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో

యువతరం కవిత విభాగం విజేతలు

**నిశ్శబ్దపు ఒడి** - చింతకింది శివశంకర్ - అంబట్ పల్లి గ్రామం, నాగర్ కర్నూల్ జిల్లా, తెలంగాణా

రాత్రి..

నీకోసం ఎంతగా ఎదురు చూసానో తెలుసా.!

ఎంతకీ రావు.

రోజురోజుకు ఆలస్యం చేస్తున్నావు.

నాకు తెలుసు., తప్పు నాదే.

ఎంత బతిమాలను.

తలుపు దాకా వస్తావు, ఇంట్లోకి రావు.

కంటిదాక వస్తావు, వొంట్లోకి రావు.

తలుపులు మూసి,

లైట్లు ఆపేసి,

దుప్పటి కప్పుకొని,

కళ్లు మూసుకొని..

ఎంతగా ఎదురుచూసాను.

కాస్తైనా కనికరించొచ్చుగా.!

ఎందుకు నామీద అంత కోపం.

నేనేమన్నానని.!?

నీవు నమ్మవు కానీ, నీకోసం

ఆకాశపు నక్షత్రాలని కంట్లో ఒత్తులు చేసుకొని ఎదురుచూసా.,

నిశ్శబ్దపు నిశీధిని కౌగిలించుకుని ఎదురుచూసాను.,

సమయాన్ని, ఆరోగ్యాన్ని తులాభారం వేసి కూడా ఎదురుచూసాను.,

రాలేదు.

నడి వీధిలో కుక్క అరుపులకు భయపడ్డవా.?

నగ్నంగా పడిఉన్న నగరాన్ని చూసి గుర్తుపట్టలేదా.?

చీకట్లో దారితప్పావా.?

దారి దొంగలు ఎత్తుకెళ్లారా.?

అయినా అర్ధరాత్రి ఎందుకు వస్తావు.

కాస్త త్వరగా వస్తే, కౌగిలించుకుని పడుకుంటగా.,

కోపం కాకు..,

తప్పు నాదే.,

తలలో వేల ఆలోచనలతో కొట్టుమిట్టాడుతూ.,

నీ గురించి ఎప్పుడు ఆలోచించలేదు.

ముందు లాప్టాప్, చేతిలో ఫోన్ పట్టుకొని రమ్మంటే,

నీవు మాత్రం ఎలా వస్తావు.

నీతో గడపాలని నాకూ ఉంది.

కానీ, నా తలలో

వేల పడగల విషపు ఆలోచనలు మూసిలా ప్రవహిస్తున్నాయి.

వేల సంవత్సరాల క్రితం పాతిపెట్టబడ్డ నాగరికతలా నా గురించి నేను వెతుక్కుంటున్నాను.

ప్రపంచమంతా ఏకమై ఏటవాలుగా ప్రసరిస్తే, ఏమి సాధించలేని ఏడారిలా మిగిలిపోతున్నా.

ఏమి చెయ్యాలో తోచక, పలుదిక్కుల్లో ఆకాశపు దిక్కును వెతుకుంటున్నా.

అడుక్కునే బతుకులో, ఎవడో నమిలి ఉసేసిన ఎంగిలి మెతుకులను ఏరుకుంటున్నా.

అయినా నీవు రాలేదు.

దేవుని ముందు పొర్లు దండాలు పెట్టలేక, నీకై పొర్లిపొర్లి వేడుకుంటున్నా..

అయినా నీవు రాలేదు.

వందల చూపుడువేళ్లు కంటిముందు నిందిస్తుంటే దుప్పటి మూసుకొని ఎక్కిఎక్కి ఏడుస్తున్నా..

అయినా నీవు రాలేదు.

ఒంటరిగా పడుకున్నప్పుడు నీ ఒడిని ఇచ్చి ఓదారుస్తావని ఎదురుచూసా..

అయినా నీవు రాలేదు.

రా.. లేదు.!

రాలే..దు.!!

ఎప్పుడో తెల్లవారుజామున నీవు వచ్చినట్టు ఉన్నావు.

ఇప్పుడు పోతే నీవు మళ్ళీ రావని.

నేను మళ్లీ లేవలేదు.

నలుగురు నన్ను మోసినా.,

నిన్ను వదిలి ఉండలేక, నేను మళ్లీ లేవలేదు.

## వేకువ కళ్ల లాంతరు

- జె.డి. వరలక్ష్మి- గోకవరం, తూ.గో. జిల్లా, ఆంధ్ర ప్రదేశ్

పొడిబారిన కళ్ళల్లో జ్ఞాపకాలేవో

హృదయంలో చెమ్మను స్పృశిస్తున్నాయి..

చూరుకింద మట్టిగోడకు జేరబడి

జామచెట్టుకొమ్మల్లో చిక్కుకున్న ఆకాశాన్ని చూస్తుంది..

రాత్రి కురిసిన మంచుబిందువులు ఆకుల నుండి జారుతూ

ఆమె కళ్ళల్లో కన్నీటి జాడకోసం వెతుకుతున్నాయి..

ఎండిపోయిన బావుల ఒరలు రెండూ

పక్కపక్కనే పెట్టినట్టున్నాయి ఆ కళ్ళు..

ఎంత జీవితాన్ని చూసి ఉంటాయో కదా అవి!

శిలైపోయిన గుండెరాయిని పెచ్చులుగా పొక్కుతీస్తే కొత్త రూపం వస్తుందా...

యవ్వనాన్నంతా వంటగదిలో వండివట్టించిన అక్షయపాత్ర ఆమె..

తనవాళ్ళ ఎదుగుదలలో ఆనందాన్ని అనుభూతి చెందుతూ

నిర్మలంగా నవ్వుతుండేది..

కాలాన్ని వెంబడిస్తూ కట్టుబడిన బంధాల కోసం

బాధ్యతల మోతమోసి

ఇదే మట్టిగోడకు జేరబడేది..

అప్పట్లో నిండైన రెండు బావులు

గుండె భారాన్ని దింపేవి..

పిలిచే పిలుపుల్లో అవసరమే తప్ప

అభిమానం లేని కంఠస్వరాలవి..

సెకనుకోసారి బాధ్యతలను గుర్తుచేసే ఈ బంధాల మెదళ్లకు

ప్రేమను పంచాలని తెలియదా!

ఎన్నిసార్లు అడగాలనుకుందో ఈ ప్రశ్నను

మౌనవ్రతమే ప్రతిసారీ..

కడుపున నలుసులు మెదిలినా భాగస్వామి ప్రేమకు నోచుకోని పుస్తెలతాళ్లెన్నో

ఆ మెడల్లో పిన్నీసుల కోసమే వేలాడుతుంటాయి..

ఆమె వేళకు తినడం నువ్వెప్పుడైనా చూసావా?

పడకగదుల్లో రాత్రిలాంతర్లు వెలిగాక

పెరటి గడపవైపు అంట్లగిన్నెల చప్పుడు

గుడ్లగూబల నిద్రను తరుముతుంటాయి..

మోగుతున్న వార్తల్లో  మంచుకొండల్లో ప్రహరా కాసే

జవానుల కష్టాలను ఏకరువు పెడుతున్నారు

ఏదో బాధ ఆమె గుండెల్లో

అయ్యో! ఎంత కష్టం వాళ్ళదని..

తన మనసు నైజం ఇంతేనేమో

గుర్తింపులేని త్యాగం ఈమెదని

చివరిదశ వెక్కిరిస్తే!

చేజారిపోయే నిద్రలో ఆమె లక్ష్యం కలలోకి రాదు..

పుస్తకాల జ్ఞానాన్ని ఇత్తడి సామాన్లలా

అటకమీద సర్దిపెట్టింది..

ఎదుగుతున్న పిల్లలబాల్యం ముందు

ఎన్నిసార్లు చెంపదెబ్బలను రుచి చూసిందో..

ఒక్కోసారి కొన్నిమాటలు

ఆ గుండె రక్తనాళాలను

తుమ్మచెట్టు ముళ్ళల్లా గుచ్చుతుండేవి..

పాచిపట్టిన నోళ్ళ వాదాలతో వదలిపోయిన కొన్ని ఆశలను

చినిగిపోయిన పుస్తకాల్లోని నడుం విరిగిన అక్షరాల్లా

చుట్టుచుట్టి చెత్తబుట్టలో పడేశారు..

ఎన్ని వేకువలు ఆకాశంలో మొలిచినా

నెరవేరని కలలు ఆ గుండెలనిండా గడ్డకట్టిపోయాయి..

స్వార్థం నిండిన మనుషుల ఎడారిలో

ఆమె బ్రతుకు పుష్పించడానికి

ఏ ఋతువు ఓదార్పురాగం పాడాలో!

రెప్పలు పడని ఆ కళ్ళకింద ఎండిన కన్నీటి జాడలే

ఆ కష్టానికి ఆనవాళ్లని తెలుసా నీకు?

ఎన్నో ఆశలను కొంగు చివర ముడిలో ముడుచుకున్న పిచ్చితల్లి ఆమె..

జనారణ్యంలో తనకంటూ ఒక పూలచెట్టు ఉందనుకుని

గంతులేసింది..

అవమానాల గొడ్డలివేట్లు

దాగున్న పసితనాన్ని చంపేసాయి..

పచ్చని అరణ్యం పోయి పేలవంగా మైదానమై

బొట్టులేని స్త్రీ నుదురులా మనసు మిగిలింది..

నలుగురి ఆకలి తీర్చే ఆమె కడుపుకూ ఆకలేస్తుంది..

నాలుగు మెతుకులు నోటికివ్వని పెనిమిటి ప్రేమ

చచ్చిన శవంమీద రాలిన పూలరెక్క..

ఆ రాతి మనుషుల గుణాలు చూసి నదులు ఏడ్చాయి..

ఓదార్పు చేతులు లేక కన్నీళ్లు గుండెల్ని బాదాయి..

అడవిలో చెట్టుపై పిట్టలు ఎగిరిపోయాక

నక్షత్రాలు ఆమెను రమ్మని పిలుస్తున్నాయి..

కమ్ముకున్న చీకటి గాయాల అడవికి నల్ల దుప్పటి కప్పింది..

ఒంటరితనాన్ని పూడ్చని మీరు

ఆమెను కదిపి దీక్షను భగ్నం చేయకండి..

ఒక జీవితకాలపు ఏకాంత గుహంతరానికి

దారి చూసుకుంటుంది

మట్టిగోడకు జారబడ్డ అమ్మ

ఆకలితో నక్షత్రాన్ని కౌగిలించుకొని అక్కడే ఉండిపోయింది.

★★★★